జీజీహెచ్‌లో పడకేసిన పారిశుద్ధ్యం

- విజృంభిస్తున్న దోమలు
- డ్రైయినేజీ నిర్మాణానికి చర్యలు శూన్యం
- కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలపై చర్యలేవీ?

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధ బోధనా సుపత్రిలోనే ఇలాంటి దుస్థితి నెలకొంది. వర్షాలు పడితే మురుగునీరు, వర్షపునీరు ఏరులై పారుతూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. ఏలూరు జీజీహెచ్‌లో సరైన రీతిలో డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవటంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలల క్రితం డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి స్వయంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఐనా, నేటికీ అలాంటి చర్యలేవీ హాస్పిటల్‌లో కానరావటంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

రోడ్లపైకి చేరుతున్న నీరు

ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తుండడంతో ఏలూరు జీజీహెచ్‌లో మురుగునీరు, వర్షపు నీటి పారుదల లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే చాలు జీజీహెచ్ ప్రధాన ద్వారం ప్రాంతంలో నీరు నిలిచి పోయి హాస్పిటల్‌లోకి వెళ్లే పరిస్థితి ఉంది. ఇక్కడ మోటారు ఏర్పాటు చేసి మురుగునీటిని తోడుతూ బయటకు పంపింగ్ చేస్తున్నారు. దశాబ్దకాలం నాటి డ్రైయినేజీ పూర్తిగా ధ్వంసమైంది. పైగా చిన్నపాటి డ్రెయిన్ మాత్రమే అప్పట్లో నిర్మించటంతో నీటిపారుదల లేకుండా పోయింది. ఇక వర్షపు నీరు నిలిచి పోతూ దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోతున్నాయి. మురుగునీరు రోడ్లపైకి వస్తూ ప్రజలకు ఇబ్బందిగా మారింది.

వెదజల్లుతున్న దుర్గంధం

ఏలూరు సర్వజన ఆసుపత్రి చుట్టూ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా నేటికీ పాతకాలం నాటి పూడుకుపోయిన డ్రెయినేజీ దర్శనమిస్తోంది. పైగా రోగులు, వైద్యులు, సిబ్బంది వినియోగించిన బాత్‌రూమ్‌ల్లోని నీరు వెళ్లే ఏర్పాటు చేసిన పీవీసీ పైపులు సైతం పాడైపోవటంతో మురుగునీరు బయటకు వస్తూ దుర్గంధం వెదజల్లుతుంది. తాత్కాలికంగా పారిశుద్ధ్య విభాగం బ్లీచింగ్ చల్లినా పెద్దగా ఉపయోగం లేకుండా పోతుంది.

జిల్లా కలెక్టర్ ఆదేశాలపై చర్యలేవీ?

ఆరు నెలల క్రితం జీజీహెచ్‌లో డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలంటూ హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంలో కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏపీ మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ మెడికల్ శాశ్వత కళాశాల భవనాన్ని నిర్మాణం చేపడుతున్న తరుణంలో డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన కలెక్టర్ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కానీ నేటికీ ఆ దిశగా చర్యలేమీ లేవనేందుకు డ్రెయినేజీ వ్యవస్థ నిదర్శనంగా కనిపిస్తోంది.



జీజీహెచ్ రెడ్‌క్రాస్ ఎదురుగా మురుగునీటిని తోడేందుకు చేసిన ఏర్పాట్లు



జీజీహెచ్‌లో బయటకు వస్తున్న మురుగుదొడ్ల నీరు



జీజీహెచ్ ఆవరణంలో ఉన్న డ్రెయినేజీలో పారని మురుగునీరు

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



ఏలూరు జీజీహెచ్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. నిత్యం హాస్పిటల్‌కు జిల్లా వ్యాప్తంగా వందలాదిమంది ప్రజలు, రోగులు వెళుతుంటారు. కనీసం డ్రెయినేజీ వ్యవస్థను సైతం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టకపోవటం విచారకరం. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీ తీసుకువచ్చింది. అనుబంధ బోధనాసుపత్రి అభివృద్ధికి సైతం ఏడాది గడచినా సరైన చర్యలు తీసుకోకపోవటం అధికారుల వైఫల్యమే.

– గరికపూడి ఇమ్మానియేల్ జయకర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

ప్రజారోగ్యంపై శ్రద్ధేది?



కూటమి ప్రభుత్వానికి ప్రజారోగ్యంపై శ్రద్ధలేనట్టు కనిపిస్తోంది. ఇప్పటికే ఏలూరు జీజీహెచ్‌లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కనీసం హాస్పిటల్‌లో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే అవకాశం లేకుండా పోయింది. పాతకాలం నాటి డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. అనారోగ్యంతో హాస్పిటల్‌కు వచ్చే రోగులకు ఇక్కడ కొత్త రోగాలు వచ్చే దుస్థితి నెలకొంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలి.

– ప్రత్తిపాటి తంబి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏలూరు అధ్యక్షుడు

క్లుప్తంగా

సున్ని జమాత్ అభివృద్ధికి కృషి



సమావేశంలో పాల్గొన్న సున్ని జమాత్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముస్లిం సమాజంలో మరుగున పడుతున్న సున్ని జమాత్‌ను అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అహలే సున్నతు వల్ జమాత్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఏలూరు అహలె సున్నత్‌వల్ జమాత్ ఆధ్వర్యంలో ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ సున్ని జమాత్ పెద్దల సమక్షంలో శనివారం స్థానిక అంజుమన్ ఫంక్షన్ హాల్‌లో సున్ని జమాత్ ఐక్యత, అభివృద్ధి కోసం చర్చించారు. సున్ని జమాత్‌ను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించడానికి అందరూ ఐకమత్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్, రాజా అహమ్మద్, ఎస్ఎం అక్బర్, ఎండీ సులేమాన్, ఎస్కే సాబీర్, ఎండీ గాలబ్ అలీ, నసీర్, ఎస్కే మస్తాన్, జబియుల్ల, గాజుల బాజీ, ఎండీ ఎగ్బాల్ పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇన్వెస్టీచర్ వేడుక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి పాఠశాలలో శనివారం ఇన్వెస్టీచర్ వేడుక ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.సాయి కుమారి శంకర్ మాట్లాడుతూ జూన్ 10న స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించామని, విద్యార్థులకు ఇన్వెస్టీచర్ వేడుక ద్వారా స్టూడెంట్ కౌన్సిల్ బాధ్యతలను అప్పగించామని తెలిపారు. ఎన్నికల ద్వారా సీనియర్ విభాగంలో హెడ్ బాయ్ వీఎస్‌వీ సంతోష్, హెడ్ గర్ల్ ఎస్ అక్షర, జూనియర్ విభాగంలో హెడ్ బాయ్ ఎన్ పార్థు వెంకట్, హెడ్ గర్ల్ ఎస్కే షగుఫ్త కౌసారికు ఇతర విభాగాల కెప్టెన్లు, వైస్ కెప్టెన్లకు బ్యాడ్జిలను బహూకరించి వారిచే ప్రమాణస్వీకారం చేయించామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా సీఆర్ రెడ్డి విద్యా సంస్థల సెక్రటరీ ఎంబీఎస్‌వీ. ప్రసాద్, జాయింట్ సెక్రటరీ వంకినేని భాను ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను అభినందించారు.

రేషన్ పంపిణీ పరిశీలన

ఏలూరు (టూటౌన్): జిల్లాలో 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు, మంచానికి పరిమితమైన వారికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి శనివారం ఏలూరులో పరిశీలించారు. ఈ నెల 26 నుంచి నెలాఖరు వరకు డీలర్లు తమ పరిధిలో ఉన్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేస్తారని ఆమె తెలిపారు. శనివారం ఉదయం ఈ కార్యక్రమం ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి విల్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసాల్లో పందులను పెంచితే చర్యలు

ఏలూరు (టూటౌన్): ప్రజారోగ్యానికి చేటు చేసే విధంగా జనావాసాల్లో పందులను పెంచే వారిపై చర్యలు తీసుకుంటామని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో పందుల సంచారంపై వచ్చిన ప్రజా ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందిచే శనివారం తనిఖీలు చేయించారు. జనావాసాలలో పందుల పెంపకం, పందుల సంచారం ఉంటే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పందుల పెంపకాన్ని ఊరిచివరకు మార్చుకోవాలని నగరపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణు, సిబ్బంది పందుల పెంపకం దారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆసుపత్రి పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.

భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

ద్వారకాతిరుమల: భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని శ్రీవారి దేవస్థానం అధికారులు శనివారం వ్యాపారులను హెచ్చరించారు. కొండపైన తూర్పు ప్రాంతంలోని దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లో కొందరు వ్యాపారులు పోటీపడి దుకాణాలను ముందుకు జరిపి, వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో భక్తులు నడిచేందుకు వీలులేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఆలయ ఏఈఓ రమణరాజు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు వ్యాపారుల ను హెచ్చరించారు. దేవస్థానం నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. భక్తులు నడిచే ప్రదేశాల్లో వస్తువులు, సామగ్రిని పెట్టి వ్యాపారాలు సాగించకూడదని అన్నారు. వెంటనే దుకాణాలను వెనక్కిజరపాలని సూచించారు. భక్తులకు అడ్డుగా ఉన్న పలు దుకాణాలను దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది, హోం గార్డులతో వెనక్కి జరిపించారు.

పీ4 రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): పీ4 పాలసీ కింద బంగారు కుటుంబాల దత్తత మార్గదర్శకులు, ఎంపిక, రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో శనివారం కలెక్టరేట్ నుంచి ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదల అభివృద్ధికి మార్గమైన పీ4 పాలసీ బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు వేగంగా గుర్తించి, నమోదు చేయాలన్నారు. సోమవారం నాటికి మంచి పురోగతి సాధించాలని ఆదేశించారు. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, పరిశ్రమలు, ప్రైవేట్ విద్యా సంస్థలు, తదితర రంగాల్లోని వారిని మార్గదర్శకులుగా రిజిస్ట్రేషన్ చేయించడంలో సంబంధించిన శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, డీఎంహెచ్ఓ పీజే అమృతం, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి పాల్ సతీష్, సీపీఓ వాసుదేవరావు, పర్యావరణ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

ఏలూరు (టూటౌన్): పీ4 అమలులో అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ వెట్రి సెల్వి సూచించారు. స్థానిక పవర్‌పేట వినాయక గుడివద్ద శనివారం 23, 24వ వార్డు సచివాలయాలకు సంబంధించి వార్డు సచివాలయం ప్రాంగణంలో పీ4 బంగారు కుటుంబాలు మార్గదర్శకులు సదస్సులో కలెక్టరు వెట్రిసెల్వి, మేయర్ షేక్ నూర్జహాన్ పాల్గొన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలో 75 వేల కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమం వేగవంతంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 23, 24వ వార్డుల్లో 194 మందిని సర్వేచేసి బంగారు కుటుంబాలుగా గుర్తించామని తెలిపారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి

ఏలూరు (టూటౌన్) : నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జె.రవిప్రకాష్ డీఆర్‌వో వి.విశ్వేశ్వరరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు రవిప్రకాష్ తెలిపారు.

చలో పొన్నూరుకు తరలిరావాలి

ఏలూరు (టూటౌన్): దళితుల ఆత్మగౌరవ పోరాట యోధుడు డాక్టర్ కత్తి పద్మారావు రచించిన పలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం గుంటూరు జిల్లా పొన్నూరులో ఈ నెల 27వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్టు దళిత నేత ఎన్.రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను శనివారం విడుదల చేశారు. తెలంగాణ ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, ప్రముఖ సైకాలజిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కూటమి సర్కారు మూల్యం చెల్లించుకోక తప్పదు

దెందులూరు: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావుపై జరిగిన దాడికి కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్ సీపీ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణ, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల దెందులూరు నియోజకవర్గం అధ్యక్షుడు తలారి రామకృష్ణ, పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి కట్టా ఏసుబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు ఎలా అమలవుతున్నాయో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తెలుసుకోవాలని హితవు పలికారు. దాడులు దౌర్జన్యాలు అక్రమ కేసులు పెడితే తర్వాత పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నిందితులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అతి త్వరలోనే రాష్ట్ర బీసీ సంఘం సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. అధికారం చేతికొచ్చేవరకు బీసీలు తమ పార్టీకి వెన్నుముక అని, అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను అణగదొక్కాలని చేస్తున్న అన్ని ప్రయత్నాలను రాష్ట్రవ్యాప్తంగా బీసీలందరూ నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పెద్దలు బీసీలపై వైఖరిని మార్చుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర బీసీ నాయకులు హెచ్చరించారు.

ఆడబిడ్డ నిధికి కూటమి మంగళం

- హామీ అమలుపై టీడీపీ నేతల అడ్డగోలు వాదన
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం సూపర్–6 హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని, ఎన్నికల ముందు అధికారం కోసమే ప్రజలను నమ్మించి, నేడు నట్టేట ముంచారని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. శనివారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ 3, 4 డివిజన్ల పరిధిలో కార్పొరేటర్ డింపుల్ జాబ్, రిషి, రెల్ల రామకృష్ణ ఆధ్వర్యంలో, 19వ డివిజన్‌లో బోగాది పార్వతి ఆధ్వర్యంలో, 27వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ప్లకార్డులను ప్రదర్శించారు.

వారి చేతకానితనం బయటపడింది

సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ 2024 ఎన్నికల ప్రచార సభలో టీడీపీ నేతలు ప్రజలను నమ్మిస్తూ అనేక హామీలు ఇచ్చారని, జనసేన నేతలు వంతపాడుతూ కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తామంటూ చెప్పారని గుర్తు చేశారు. కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని, ఆడబిడ్డ నిధిగా దీన్ని అమలు చేస్తామని మహిళలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు మంత్రి అచ్చెం నాయుడు నిండు సభలో మాట్లాడుతూ ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాల్సి వస్తుందని చెప్పటం టీడీపీ చేతకానితనానికి నిదర్శం అని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా, కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తూ ఆర్థికంగా నష్టపోయినా సంక్షేమ పథకాలను ఆపలేదని, ప్రభుత్వం వద్ద డబ్బు లేదనే మాట చెప్పలేదని గుర్తుచేశారు. తల్లికి వందనం డబ్బులు సైతం కొందరికే వేశారని, ఏలూరు నియోజకవర్గంలోనే వేలాదిమంది తల్లులకు నేటికీ సొమ్ములు వేయలేదని తెలిపారు.



క్యూఆర్ కోడ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సమన్వయకర్త జేపీ, నాయకులు

సిగ్గుచేటు

ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను ఎంతోకాలం మోసం చేయలేదని, రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి గట్టిగా బుద్ధిచెప్పేందుకు ఇప్పటికే జనం డిసైడ్ అయ్యారని తెలిపారు. మహిళలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక ఏడాది దాటిన అనంతరం హామీలు అమలు చేయలేమని చెప్పటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమాల్లో నాయకులు దాలి వెంకటేష్, సీహెచ్ శ్రీరాములు, సీహెచ్ తిమోతి, నవీన్, బెనర్జీ, విజయకుమార్, పట్నాల శ్రీనివాస్, గొర్ల లెనిన్, గొర్ల లక్ష్మీనారాయణ, రెల్ల వరలక్ష్మి, సావిత్రి, అయ్యప్ప, కోటి, శ్రీను, పాము శ్యామ్, శ్రావణ్, రాజు, అన్నపూర్ణ, పానుగంటి అశోక్, కొట్టు నాగభూషణం, అచ్యుత కుమారి, చిట్టిబాబు, వాడపల్లి నాగభూషణం, ప్రభుదాస్, కొట్టు కోటేశ్వరరావు, సీహెచ్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, బీసీ సెల్ నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి కిలారపు బుజ్జి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, కొల్లిపాక సురేష్, తులసీ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): జూనియర్ న్యాయవాదులు చట్టాలపైన పూర్తి అవగాహన పొంది కక్షిదారులకు త్వరితగతిన న్యాయ సహాయం అందించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్‌లో శనివారం ప్రజలకు, జూనియర్ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రత్న ప్రసాదు మాట్లాడుతూ ప్రతి శనివారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జూనియర్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు కొనే సీతారాం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.

ఆహార పదార్థాల తనిఖీ

ఏలూరు నగరంలోని శనివారపు పేట ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు శనివారం సందర్శించారు. విద్యార్థుల సౌకర్యాలు, వారికి పెడుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రతి నెలా తనిఖీల్లో భాగంగా ఈ పరిశీలన చేశామన్నారు. సూపరింటెండెంట్ శ్రీవల్లి, న్యాయవాది తుమరాడ వెంకటేశ్వరరావు, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సోషల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సమావేశాల ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మరో ముఖ్య అతిథి ఎస్పీ కేపీ శివకిశోర్ మాట్లాడుతూ నేటి మీడియా సత్యాన్ని ప్రజలకు తెలపాలని కోరారు. సభలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మాణిక్యరావు, ఫొటో జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్కే రియాజ్‌లను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ ఎ.సురేష్‌కుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేపీకే కిషోర్, టైమ్స్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రియాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చంటి, అతిథులు

రిజర్వేషన్ల పితామహుడు సాహూ మహారాజ్



సాహూ మహారాజ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహూ మహారాజ్ అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన సాహూ మహరాజ్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1894లో సాహూ మహరాజ్ మహారాష్ట్రలోని కొల్హాపూర్ సంస్థాన పాలనాధికారాలను స్వీకరించారన్నారు. ఛత్రపతి శివాజీ వారసుడుగా గద్దెనెక్కిన సాహూ మహరాజ్ మహాత్మా పూలే నిర్వహించిన సత్యశోధక ఉద్యమ వారసత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. సామాజిక సంస్కరణలు, వెనుకబడిన కులాల పిల్లలకు ఉచిత విద్యావకాశాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, వ్యవసాయదారులకు ప్రత్యేక సౌకర్యాలు, అస్పృశ్యత నివారణ, వెట్టి చాకిరీ రద్దు వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి భారత దేశంలోనే విలక్షణమైన ప్రజాపాలకుడిగా సాహూ మహరాజ్ పేరు గాంచారని వివరించారు. కార్యక్రమంలో నూకపెయ్యి కార్తీక్, గాలాయగూడెం సర్పంచ్ సుబ్బారావు, తెనాలి సురేష్, కనికెళ్ల రవి కుమార్, గోవిందరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బీన్సచిక్కుడు	96
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	38
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	64	కంద	00
కాకర కాయలు	30	బీట్‌రూట్	38
బీరకాయలు	26	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
అనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	25-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	06
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	05
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	09
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	22
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	15
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - తిరుపతి	16.00	4830	34